


**కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -86 బుధవారం 2 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

## హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..! కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!

## రాజకీయ ప్రకంపనలు రేపుతున్నపరిణామాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. **మిగతా 2లో...**



# దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి
## బంగారాన్ని అనవసరంగా కొనకండి
## డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
## దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
## ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. **మిగతా 2లో...**



# నేడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

## పాయకరావుపేట పేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసి గోదావరి జలాలకు జల హారతి ఇచ్చి స్వాగతం పలకనున్న సీఎం



**అమరావతి, సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
ఏలేరు, పంపా, తాండవ, వరాహ, శారద నదులను దాటుకుంటూ ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలు పారనున్నాయి. తూర్పు కనుమల్ని తొలిచి, క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాలను అధిగమిస్తూ పోలవరం లెఫ్ట్ మెయిన కెనాల్ నిర్మాణ పనులు చేపట్టారు. **మిగతా 2లో...**

# రాజకీయాల్లో మార్పు కోసమే

## నేడు 'జనసేన యువజన విభాగం' ఆవిష్కరణ

**నేడు (సెప్టెంబరు 2) పవన్ కల్యాణ్ జన్మదినం**
**జనసేన యువజన విభాగం ప్రారంభం**
**పిఠాపురంలో ప్రధాన కార్యక్రమం, రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు**
**రాజకీయాల్లో మార్పు కోసమే యువజన విభాగం ఏర్పాటు అన్న నాదెండ్ల**
**సాంకేతిక కారణాలతో పవన్ సందేశం ఉండకపోవచ్చని వెల్లడి**
**స్థానిక ఎన్నికల్లో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తామని హామీ**



**అమరావతి,సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
జనసేన పార్టీ తన రాజకీయ ప్రస్థానంలో కీలక అడుగు వేస్తోంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినమైన సెప్టెంబర్ 2న 'జనసేన యువజన విభాగం'ను అధికారికంగా ఆవిష్కరించనుంది. రాజకీయాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా, "దేశమే ఫస్ట్" అనే **మిగతా 2లో...**

# ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

**హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..**
**హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు**
**భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు**
**గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు**
**హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి**



**హైదరాబాద్ సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. **మిగతా 2లో...**

# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టులో ఊరట

## సింగిల్ జడ్జి తీర్పును సస్పెండ్ చేసిన డివిజన్ బెంచ్

## రంగనాథ్‌ను తప్పించాలంటూ ఇచ్చిన తీర్పు నిలిపివేత



2లో.

# ఎపిలో సర్ గడువు పొడిగింపు

## సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం



**అమరావతి,సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి చేసిన అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై ÷-లకెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. **మిగతా 2లో...**

# గణేష్ ఉత్సవాలు సజావుగా నిర్వహించాలి



**హైదరాబాద్ సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన **మిగతా 2లో...**

# నేడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

**మొదటిపేజీ తరువాయి**

పోలవరం ఎడమ కాల్వ నిర్మాణంలో భాగంగా వివిధ నదీ ప్రవాహాల వద్ద సైఫన్లు.. అక్విడెక్టుల నిర్మాణం జరిగింది. కొన్ని చోట్ల నదీ ప్రవాహానికి ఎగువన..ఇంకొన్ని చోట్ల ప్రవాహానికి దిగువ నుంచి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం చేపట్టారు.ఏలేరు నది బెడ్ లెవల్ కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణం చేపట్టిన కూటమి ప్రభుత్వం, పంపా నది ఎగువ నుంచి అక్విడక్ట్ నిర్మించి పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలకు మార్గంను సుగమం చేసారు ఇంజనీర్లు.
పంపా నదిపై అక్విడెక్ట్ నిర్మాణానికి 30 మీటర్ల లోతు వరకు 312 పైల్స్‌తో పునాదుల వేసి అక్విడెక్ట్ నిర్మాణం చేపట్టారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడక్టు నిర్మాణంతోపాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తాళ్లపాలెం భూ వివాదాన్ని పరిష్కరించి మొత్తంగా 472 కుటుంబాలకు పునరావాసం జరిగింది.
ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం చేకూరనుంది.

# ఎపిలో సర్ గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి**

ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోయినా ఈ గడువులోగా ÷-లకెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని ఓటర్ల జాబితా సవరణ పక్రియకు సంబంధించి ఈ తేదీలు మారాయి. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది.ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేరులో తప్పులు, చిరునామా మార్పులు లేదా ఇతర వివరాల్లో సమస్యలు ఉంటే నిర్ణీత గడువులోగా ÷-లకెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించి సవరించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# రాజకీయాల్లో మార్పు కోసమే

**మొదటిపేజీ తరువాయి**

నినాదంతో ఈ విభాగం పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో బుధవారం జరగనున్న ప్రధాన కార్యక్రమ ఏర్పాట్లను ఆయన నేడు పరిశీలించి, మీడియాతో మాట్లాడారు.
పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ శ్రేణులకు ఇదొక పండుగ రోజు అని మనోహర్ అభివర్ణించారు. పిఠాపురం వేదికగా యువజన విభాగానికి సంబంధించిన ప్రత్యేక లోగో, గీతం, ఆడియో విజువల్‌ను ఆవిష్కరిస్తామని వెల్లడించారు. ఈ ప్రధాన కార్యక్రమంతో పాటు రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ యువజన విభాగం ఆవిష్కరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. పోలీసుల అనుమతితో బైక్ ర్యాలీలు చేపడతారని, పిఠాపురంలో జరిగే కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారని వివరించారు.
ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు ప్రత్యేక సందేశం ఇస్తారని భావించినప్పటికీ, అది సాధ్యపడకపోవచ్చని మనోహర్ స్పష్టం చేశారు. "ప్రస్తుతం పవన్ కల్యాణ్ గారు కేరళలో చికిత్స పొందుతున్నారు. అక్కడి సాంకేతిక సమస్యల కారణంగా రేపటి కార్యక్రమంలో ఆయన సందేశం ఉండకపోవచ్చు" అని ఆయన పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు, మహిళలకు జనసేన ప్రాధాన్యం ఇస్తుందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ ఆశయ సాధనలో యువత ముందుండి, పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ కీలక భాగస్వాములు అవుతారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు

**మొదటిపేజీ తరువాయి**

దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది.
మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

**మొదటిపేజీ తరువాయి**

ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.
ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి.
వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి.
ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

**మొదటిపేజీ తరువాయి**

దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టులో ఊరట

### సింగిల్ జడ్జి తీర్పును సస్పెండ్ చేసిన డివిజన్ బెంచ్

### రంగనాథ్‌ను తప్పించాలంటూ ఇచ్చిన తీర్పు నిలిపివేత

**హైదరాబాద్ సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో జీఎల్ ఆర్ 243లో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గతంలో ఈ కేసు విచారణలో భాగంగా హైడ్రా కమిషనర్ ను తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం నిలిపివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై హైడ్రా కమిషనర్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసిన విషయం విదితమే. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. హైడ్రా కమిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రాజీవ్ శక్దర్ సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం డివిజన్ బెంచ్ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను నవంబరు 3కు వాయిదా వేసింది.
కేసు పూర్వాపరాలు..
సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని జీఎల్ ఆర్ 243లో 119 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బీ-2 భూములుగా పేర్కొన్న వీటిని ఆస్పత్రులు, పాఠశాలలు.. ఇలా రాష్ట్ర ప్రభుత్వ అవసరాల నిమిత్తం సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేటాయించింది. వీటి హక్కుదారుగా రాష్ట్ర ప్రభుత్వం ఉండటమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటుంది. జులై 18న తిరుమలగిరి అల్వాల్ ప్రాంతంలోని ఈ 119 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ డిఫెన్స్ ఎస్టేట్ అధికారులు కూడా ధ్రువీకరించారు. ఇందుకు సంబంధించిన కో ఆర్డినేట్స్, గూగుల్ ఎర్త్‌మీద క్లియర్‌గా మార్కు చేస్తూ కేఎంఎల్ ఫైల్ ఇచ్చారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు

### తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు

### సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం

### ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు

### పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు

**హైదరాబాద్ సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.
సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# నల్గొండ ఘటనపై రగులుతున్న రాజకీయం...

### టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

**నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి ఇంటిపై నిన్న దాడి**

**బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు బయల్దేరిన రాంచందర్ రావు**

**హైదరాబాద్ సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై నిన్న జరిగిన దాడితో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈరోజు నల్గొండ బయల్దేరిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు తార్నాకలోని ఆయన నివాసం వద్ద అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల ఆంక్షలను ధిక్కరించి ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలోకి తరలించారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తూ... ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీ నాయకులపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. బాధితులను పరామర్శించడానికి వెళుతుంటే అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1000 రోజుల పాలనలో ప్రజలను తీవ్రంగా దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి అతి సమీపంలో ఉందని జోస్యం చెప్పారు.ఈ ఘటనతో అటు నల్గొండలోనూ, ఇటు రాజధాని హైదరాబాద్‌లోనూ ఇరు పార్టీల మధ్య ప్రతిఘటనలు తీవ్రరూపం దాల్చాయి. నల్గొండలోని వర్షిత్ రెడ్డి ఇల్లు, కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా బీజేపీ కౌంటర్ ఎటాక్‌కు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా శ్రమించి అడ్డుకున్నారు. నిరసనలు, అరెస్టులతో రెండు పార్టీల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం కొనసాగుతోంది.

# గణేష్ ఉత్సవాలు సజావుగా నిర్వహించాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, మండపాల నిర్వాహకులు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళ వారం ఉన్నతస్థాయి సన్నాహక సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహిం చాలని, మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిం చాలని సూచిం చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్టు స్పష్టం చేశారు.

**పటిష్ట భద్రత ట్రాఫిక్ నియంత్రణ**

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. షీ టీమ్స్, యాంటీ-థెఫ్ట్ బృందాలతో నిరంతర నిఘా ఉంచాలని, శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడాలని మంత్రి చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ వాలంటీర్లను సిద్ధం చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ అధికారులు 24 గంటలపాటు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోడ్డు మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, ఫాగింగ్, బయో టాయిలెట్లు, బేబీ పాండ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. కీలక ప్రాంతాల్లో 24 గంటల వైద్య శిబిరాలు, అంబులెన్సులు, డాక్టర్లు, మందులతో కూడిన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య శాఖను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, టూరిజం శాఖ లైఫ్‌బోట్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు.

**ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే వినియోగించాలి**

ఆర్టీసీ ఆధ్వర్యంలో దాదాపు 700 ప్రత్యేక బస్సులను నడపాలని, ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే వినియోగించాలని మంత్రి ఆదేశించారు. మెట్రో రైలు సర్వీసుల వేళలను పొడిగించడంతో పాటు, రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని చెప్పారు. హైదరాబాద్‌లో 47 ఏండ్లుగా కొనసాగుతున్న ఉత్సవాల సంప్రదా యాన్ని కాపాడుతూ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాల న్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో సంబంధిత శాఖల అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, రఘువీర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, ఏడీజీపీ మహేష్ భగవత్, పోలీస్ కమిషనర్లు సజ్జనార్, రమేష్, సుమతి, జాయింట్ సీపీ జోయెల్ డేవిస్, హెచ్‌ఎండీఏ కమిషనర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంత రావు, ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనా రాయణ, టూరిజం ఎండీ గౌతమి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జాయింట్ ఎండీ మయాంక్ మిట్టల్, సాంస్కృతిక శాఖ సంచాల కులు నరసింహారెడ్డి, ఐఅండ్‌పీఆర్ అదనపు సంచా లకులు డీఎస్ జగన్, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, రవాణాశాఖ హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ వెంకటరమణ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రాఘవరెడ్డి, కార్యదర్శి శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## లచ్చురాంనాయక్ చిత్రపటానికి నివాళులర్పించిన
# మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్



**కేసముద్రం/సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జాటోత్ హరినాయక్ తండ్రి, దివంగత జాటోత్ లచ్చురాంనాయక్ దశదిన కర్మ కార్యక్రమం మంగళవారం కేసముద్రంలోని లక్ష్మీసాయి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమా నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లచ్చురాంనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో నాయకులు బదావత్ శంకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రముఖులు, బంధువులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని లచ్చురాంనాయక్‌కు నివాళులర్పించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):**
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ధర్మసాగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ కొట్టే ఏషోబు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లను యాజమాన్యాలు నిలిపివేయకుండా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షుడు గంగారపు ఎల్లస్వామి, ఉపాధ్యక్షుడు ఎడ్ల రాజు, కొట్టే దయాకర్, గంగారపు సురేష్, బేరే వెంకటేశ్వర్లు, కొట్టే బిక్షపతి, మాదాసి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వర్ల రామయ్యకు బైరపాక ప్రభాకర్ శుభాకాంక్షలు



**ధర్మసాగర్/ సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు వర్ల రామయ్యను తెలంగాణ టీడీపీ రాష్ట్ర, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకుడు బైరపాక ప్రభాకర్ ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బైరపాక ప్రభాకర్ మాట్లాడుతూ.. టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి అణగారిన వర్గాల సంక్షేమం కోసం వర్ల రామయ్య నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు శాసనమండలి సభ్యత్వం లభించడం టీడీపీ శ్రేణులతో పాటు ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం వర్ల రామయ్య అందిస్తున్న సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఆయన సహకారం అందించాలని కోరారు.

# కూటమి పాలనతోనే రాష్ట్రానికి నిజమైన అభివృద్ధి

**జలుమూరు/ సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):**



కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గ అర్చన అన్నారు. జలుమూరు మండలం గుగ్గిలి గ్రామంలో రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను సేకరించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని అర్చన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, చల్లవానిపేట పీఏసీఎస్ చైర్మన్ దుంగ స్వామిబాబు, నీటి సంఘం అధ్యక్షుడు జుత్తు అప్పలనాయుడు, బూత్ కన్వీనర్ టెంక కృష్ణారావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పట్టు పురుగుల వ్యర్థాలతో సిరికంపోస్ట్

## రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్త ఎన్ భువన.. మల్బరీ తోటలకు సేంద్రియ ఎరువుగా వినియోగం





**హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):**పట్టు పురుగుల పెంపకంలో మిగిలే బెడ్ వేస్ట్‌ను వృథాగా పారేయకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి సిరికంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని సెంట్రల్ సిల్క్ బోర్డుఆర్ఎస్ఆర్ఎస్ (ములుగు) శాస్త్రవేత్త ఎన్ భువన రైతులకు సూచించారు. పట్టు పురుగుల వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంతోపాటు, వాటిని సేంద్రియ ఎరువుగా మార్చుకుని సాగు ఖర్చును కొంత మేర తగ్గించుకోవచ్చని తెలిపారు. గిర్నిబావిలో సెంట్రల్ సిల్క్ బోర్డుఆర్ఎస్ఆర్ఎస్ (ములుగు), వరంగల్ సెరికల్చర్ శాఖ సమన్వయంతో ఎంఆర్ఎంఏ 2.0 సాంకేతిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ భువన మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకంలో ఉత్పత్తయ్యే బెడ్ వేస్ట్‌ను ఎప్పటికప్పుడు సేకరించి, ఇతర వ్యర్థాలతో కలపకుండా వేరు చేయాలని రైతులకు వివరించారు. బెడ్ వేస్ట్‌ను పరిశుభ్రంగా, తేమ ఎక్కువగా లేకుండా నిర్వహించడం వల్ల చీడపీడలు, పురుగుల వ్యాధులు వ్యాపించే ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. వ్యర్థాలను రోడ్ల పక్కన, తోటల వద్ద ఎక్కడపడితే అక్కడ పడేయకుండా నిర్ణీత ప్రదేశంలో సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

**వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు**

బెడ్ వేస్ట్‌తో సిరికంపోస్ట్ తయారు చేసే విధానాన్ని ఎన్ భువన రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. బెడ్ వేస్ట్‌ను సేకరించి, అవసరమైన పద్ధతిలో కుళ్లబెట్టి కంపోస్ట్‌గా మార్చుకోవచ్చని వివరించారు. సరైన విధానంలో తయారైన సిరికంపోస్ట్‌ను మల్బరీ తోటలకు సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవచ్చన్నారు. దీంతో నేలలో సేంద్రియ పదార్థం పెరగడంతోపాటు భూసారం మెరుగుపడుతుందని తెలిపారు.మల్బరీ మొక్కలకు అవసరమైన పోషకాలు అందడంతో మొక్కల ఎదుగుదల మెరుగుపడి, నాణ్యమైన ఆకులు లభించే అవకాశం ఉంటుందని ఎన్ భువన వివరించారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించుకోవడంతోపాటు, పట్టు పరిశ్రమలోనే ఉత్పత్తయ్యే వ్యర్థాలను తిరిగి సాగుకు ఉపయోగించుకోవచ్చన్నారు.

**రైతులకు ఉపయోగకరమైన విధానం**

పట్టు పురుగుల బెడ్ వేస్ట్‌ను సమస్యగా చూడకుండా విలువైన వనరుగా మార్చుకోవాలని ఎన్ భువన సూచించారు. వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతోపాటు, పట్టు పురుగుల పెంపక ప్రాంతాల్లో పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని తెలిపారు. పట్టు రైతులందరూ ఈ విధానాన్ని పాటించి బెడ్ వేస్ట్‌ను సిరికంపోస్ట్‌గా తయారు చేసుకుని మల్బరీ తోటల్లో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని సెంట్రల్ సిల్క్ బోర్డుఆర్ఎస్ఆర్ఎస్ (ములుగు) శాస్త్రవేత్త ఎన్ భువన, వరంగల్ సెరికల్చర్ సహాయ సంచాలకుడు తిరుపతిరెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్య సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో పట్టు రైతులు పాల్గొని బెడ్ వేస్ట్ నిర్వహణ, సిరికంపోస్ట్ తయారీ విధానాలను తెలుసుకున్నారు.

# సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి

**పెన్షన్ ఉద్యోగి హక్కు.. బిక్ష కాదు**

**పింఛన్ విద్రోహ దినం సందర్భంగా**

**తెలంగాణ పీఆర్‌టీయూ మహాధర్నా**



**కేసముద్రం/ సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):**
సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపాల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మహాధర్నాకు తరలివెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు తమ జీవితంలో విలువైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేసిన అనంతరం వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు పెన్షన్ ఆర్థిక భద్రత కల్పిస్తుందన్నారు. సీపీఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ కాలం ప్రజా సేవ చేసిన ప్రజాప్రతినిధులకు పెన్షన్లు, వివిధ సౌకర్యాలు కల్పిస్తుండగా.దశాబ్దాల పాటు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేయడం అన్యాయమన్నారు.ఉద్యోగులు ప్రతినెలా తమ వేతనం నుంచి కొంత మొత్తాన్ని పదవీ విరమణ అనంతర భద్రత కోసం చెల్లిస్తున్నప్పటికీ, సీపీఎస్‌లో భవిష్యత్తులో ఎంత పెన్షన్ వస్తుందో స్పష్టత లేకపోవడం ఆందోళనకరమన్నారు. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడుల రాబడిపై ఆధారపడే విధానం వల్ల పదవీ విరమణ అనంతరం ఆదాయంలో అనిశ్చితి ఏర్పడుతుందని తెలిపారు. పెన్షన్ ఉద్యోగి హక్కే తప్ప బిక్ష కాదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, విజయ, కుమారి, నవీన్, చంద్రశేఖర్, పార్థసారథి, రమేష్, పిలిప్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దాడులను ఖండిస్తూ బీజేపీ నిరసన

**సత్తుపల్లి/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**



హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి నివాసంపై దాడి, రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు అరెస్టును నిరసిస్తూ సత్తుపల్లిలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులకు స్థానం లేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీపై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో వైఫల్యంపై సమాధానం చెప్పకుండా ప్రతిపక్షాలపై దాడులు చేయించడం సరికాదన్నారు. నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ కార్యాలయం, నల్గొండ జిల్లా అధ్యక్షుడి నివాసంపై దాడులు కాంగ్రెస్ ప్రభుత్వ అసహన రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రతిపక్ష గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై బీజేపీ మరింత ఉధృతంగా పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా కార్యదర్శి పాల నాగసురేందర్‌రెడ్డి, నాయకులు పడిగల మధుసూదనరావు, షేక్ రహంతుల్లా, బాణావత్ విజయ్, సాలి శివకృష్ణ, బొర్రా నరసింహారావు, పసుపులేటి సుబ్బారావు, గొర్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు ఎస్సై వెంకటకృష్ణ**



**తల్లాడ/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
హెల్మెట్, సరైన నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ హెచ్చరించారు. మంగళవారం తల్లాడలో నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ సారంగపాణి పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేని వాహనదారులకు జరిమానాలు విధించి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సరైన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకున్న వారికి వెసులుబాటు కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడి తప్పించుకునే క్రమంలో నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపే అవకాశముందని, అందుకే ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

# వెయ్యి రోజులుగా అసెంబ్లీకి డుమ్మా..

## కేసీఆర్ రాజీనామా చేయాలి -కల్లూరులో కాంగ్రెస్ భారీ నిరసన




**కల్లూరు/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
ప్రతిపక్ష నేతగా ప్రజలిచ్చిన బాధ్యతను విస్మరించి అసెంబ్లీకి హాజరు కావడం లేదంటూ మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా పిలుపు మేరకు కల్లూరులో మంగళవారం భారీ నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన కేసీఆర్ వెయ్యి రోజులుగా అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవికి న్యాయం చేయలేని కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలి లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి' అని నినదించారు.కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోట్రు అర్జున్‌రావు, పట్టణ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, నీరజ చౌదరి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆలకుంట, అంకిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసనలు



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా బుధవారం నుంచి వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాల్లో వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.హసన్‌పర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ సంగాల విక్టరీబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, 1వ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, 55వ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, హసన్‌పర్తి డివిజన్ మాజీ అధ్యక్షుడు జక్కు రమేష్ మాట్లాడారు.నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, రైతులు, యువజన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. తాజా మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఐదో వార్డులో కల్వర్టుకు శంకుస్థాపన



**వైరా/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి మంగళవారం శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. వైరాను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. 'స్వచ్ఛ వైరాస్వచ్ఛ మున్సిపాలిటీ' నినాదంతో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శ్రీమాన్య, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## రాహుల్‌పై ఎఫ్ఐఆర్‌కు నిరసనగా

# కాంగ్రెస్ రాస్తారోకో



**తల్లాడ/ సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):**
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఉత్తరాఖండ్‌లో దురుద్దేశపూర్వకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ తల్లాడ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై నమోదు చేసిన కక్షపూరిత ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్‌లో కుల వివక్షకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ సమానత్వం, పౌరుల గౌరవ పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న సీఐ పులి రమేష్‌కు ఘన వీడ్కోలు



**ఎల్కతుర్తి/సెప్టెంబర్1( జర్నలిస్ట్ వార్త);**
ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన పులి రమేష్ బదిలీపై వెళ్తుండటంతో మండల కేంద్రంలో వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హాజరై సీఐ పులి రమేష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీఐ పులి రమేష్ విధి నిర్వహణలో ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవారని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి పనిచేశారని గుర్తుచేశారు.ఎల్కతుర్తి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించడంలో సీఐ రమేష్ కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన అందించిన సేవలను ఎప్పటికీ మరువలేమని, బదిలీపై వెళ్తుండటం బాధాకరంగా ఉందని అన్నారు.అనంతరం క్లబ్ అధ్యక్షుడు దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సాథూరి కిష్టయ్య మాట్లాడుతూ ఉద్యోగరీత్యా బదిలీలు సహజమేనని, ఎక్కడ విధులు నిర్వహించినా పులి రమేష్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సీఐ పులి రమేష్ సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు.

# శిరీష కుటుంబానికి ప్రభుత్వ అండ

## రూ.5 లక్షల తక్షణ సాయం.. ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం

## వ్యవసాయ భూమి కేటాయింపునకు హామీ



**అశ్వారావుపేట/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన నర్సు ఊకె శిరీష అనుమానాస్పద మృతితో విషాదంలో ఉన్న ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చౌటిగూడెం చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యే శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.కుటుంబానికి రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఐటీడీఏ ద్వారా అవసరమైన సహాయం అందిస్తామని చెప్పారు. కుటుంబ జీవనోపాధి కోసం ప్రభుత్వ భూమిలో కొంత వ్యవసాయ భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. న్యాయం జరిగే వరకు శిరీష కుటుంబానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భరోసా ఇచ్చారు

# బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణ కావాలి

**అశ్వారావుపేట/ సెప్టెంబర్ 1: (జర్నలిస్ట్ వార్త);**
అన్ని కులాలు, వర్గాలు, రంగాలు అభివృద్ధి చెందినప్పుడే బహుజన తెలంగాణ సాధ్యమని ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది డా. ఈడా శేషగిరిరావు అన్నారు. బీసీలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అశ్వారావుపేటలో మంగళవారం ఆధార్ పార్టీ సమావేశం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఊకె ముత్తయ్యదొర అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శేషగిరిరావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రజల జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలు సహా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు ఆధార్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న యువతీ, యువకులకు పార్టీలో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



### 119 స్థానాల్లో పోటీ

2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ఆధార్ పార్టీ పనిచేస్తోందని శేషగిరిరావు తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో జరగనున్న ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు అంబోజు బుదయ్య, ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఇన్‌చార్జి ప్రేమ్‌దయాల్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కుక్కల నాగేశ్వరరావుగౌడ్, నాయకులు తల్లాడ వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, రవి, పోలయ్య, ఈడా అశోక్, మంగపతి, అక్కులయ్య, సునీల్, నూక రమేష్, వెంకట్, రహీం పాషా, సుమలత, దీప్తి, కరిష్మా, షేక్ సీనా, సుభాషిణి, రాధ, అలివేలు, లక్ష్మీ, సుమతి తదితరులు పాల్గొన్నారు

# సత్తుపల్లికి బీజేపీ జిల్లా స్థాయిలో కీలక పదవులు



**సత్తుపల్లి/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన ఎస్కే రహమతుల్లా ఎన్నికయ్యారు. అలాగే ఖమ్మం జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా చీకటి వసంతరావు, వందనపు భాస్కరరావుకు అవకాశం లభించింది.పార్టీపై నిబద్ధత, అంకితభావంతో పనిచేసిన నాయకులకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల సత్తుపల్లి బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు తెలిపారు.సత్తుపల్లి మండలం నుంచి పార్టీకి సేవలందిస్తున్న నాయకులకు జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన రహమతుల్లా, వసంతరావు, భాస్కరరావులను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

# మా ప్రభుత్వంలోనే డ్రైనేజీ వ్యవస్థ రూపురేఖలు మారుస్తాం

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త);**
వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 1, 65, 66వ డివిజన్లలో రూ.3.75 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2025 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే పనులు చేపట్టినట్లు తెలిపారు. దశలవారీగా అన్ని డివిజన్లు, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, గతంలో



రెండుసార్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని వారు ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే ను సంప్రదించాలని కోరారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము, సునీల్, గొర్రె కిరణ్, మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్, మాజీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు కనపర్తి కిరణ్, స్వాతి, దేవరకొండ అనిల్, చంటి రెడ్డి, ఎర్ర ప్రకాష్, శ్రీకాంత్‌రెడ్డి, విసం సురేందర్‌రెడ్డి, భాషా, వేణు, కుమారస్వామి, వెంకటస్వామి, ఆనంద్, ఎల్ఐసీ వెంకన్న, నరసింహా, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నరసమ్మ మృతికి ఘన నివాళి



**కేసముద్రం/ సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన అనుమాస నరసమ్మ మృతి చెందారు. ఆమె మృతికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు సంతాపం తెలిపారు. మంగళవారం నరసమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.
నరసమ్మ స్థానిక ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అనుమాస కుమార్ తల్లి. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ తరాల వీరేశ్ యాదవ్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, గ్రామస్థులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# టాక్సీ డ్రైవర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా షేక్ నాగుల్ పాషా.. ఉపాధ్యక్షుడిగా మర్రిపెల్లి రాజేష్

**కేసముద్రం/ సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండల టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్ నాగుల్ పాషా, ఉపాధ్యక్షుడిగా మర్రిపెల్లి రాజేష్ (సన్నీ), కార్యదర్శిగా గొట్టం లక్ష్మణ్, కోశాధికారిగా చాపల మధు ఎన్నికయ్యారు.మండల కేంద్రంలోని గౌడ సంఘం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన నిర్వాహకులు మాట్లాడుతూ టాక్సీ డ్రైవర్లు, వాహన యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. డ్రైవర్ల సంక్షేమం, ఐక్యత కోసం పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, వాహన యజమానులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ కార్యాలయాలపై దాడులకు నిరసనగా రాస్తారోకో

**కేసముద్రం/ సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం, నల్గొండ జిల్లా కార్యాలయం, జిల్లా అధ్యక్షుడి నివాసంపై జరిగిన దాడులకు నిరసనగా కేసముద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయం కూడలిలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మండల బీజేపీ అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ మాట్లాడుతూ బీజేపీ కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి బదులు వారిపై లాఠీఛార్జ్ చేయడం దుర్మార్గమని, ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే మండలవ్యాప్తంగా మరిన్ని నిరసనలు చేపడతామని హెచ్చరించారు.బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై దాడులకు దిగడం సరికాదన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు రామడుగు వెంకటాచారి, మున్సిపల్ కన్వీనర్ నాగేశ్వరాచారి, నాగరబోయిన చంద్రకళ, లెంకలపల్లి శ్రీనివాస్, వెలిశాల నవీన్, జాటోత్ నరేష్, జమ్ముల గోపాల్‌రెడ్డి, బాణోత్ సంపత్, జుజ్జూరు వీరభద్రాచారి, వాంకుడోత్ నరేష్, పూరిక సోమరాజ్, బాణోత్ యాకూబ్, మంగిశెట్టి నాగంబాబు, రవి, వినోద్, గుండు ధమోదర్, రాజు, సురేష్, నరేష్, బొల్లోజు వీరాచారి తదితరులు పాల్గొన్నారు.



# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కె.సి. గుప్త జయంతి వేడుకలు

**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, నిస్వార్థ ప్రజాసేవకులు, నిజాం పాలకులపై పోరాడిన వీరుడు స్వర్గీయ కల్వకుంట్ల చంద్రసేన (కె.సి.) గుప్త జయంతి వేడుకలను హసన్‌పర్తిలో ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేయడంతో పాటు సిల్వర్ స్టార్ దాత చకిలం రాజేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు.
క్లబ్ అధ్యక్షుడు నాగమల్ల మాధవ శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కె.సి. గుప్త చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కె.సి. గుప్త అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. 11 మందితో ఆయన ప్రారంభించిన ఒక క్లబ్ నేడు దేశ, విదేశాల్లో విస్తరించి అంతర్జాతీయ సేవా సంస్థగా రూపుదిద్దుకుందని తెలిపారు. లక్ష మంది సభ్యులు, రెండు వేల క్లబ్‌లతో ఏటా కోట్లాది రూపాయల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ 2013లో రాష్ట్రపతి అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అప్పని రమేశ్, మాజీ అధ్యక్షులు వెలగందుల భీష్మనాథం, మంచెన శ్యాంసుందర్, సంద్రు నాగేందర్, భూపతి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు భారతీదేవి, ఆశాజ్యోతి, కళావతి, కవిత, శశికళాధర్ తదితరులు పాల్గొన్నారు.



# ఓపీఎస్ పునరుద్ధరించాలి

### హసన్‌పర్తిలో ఉద్యోగుల ధర్నా




**హసన్‌పర్తి/సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర టీఎన్‌జీవో, టీజీవో యూనియన్ల పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాణి, ఏఈపీఆర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అనిల్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు జనగాని అశోక్, గౌరవ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శులు హరిత, భార్గవి, హేమలత, రవీందర్, సృజన, ప్రశాంతి, చైతన్య, అనూష, ఏపీవో విజయలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోండి

**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):**
ఓటరు జాబితాలో పేర్లు, ఇంటిపేరు, తండ్రి పేరు, వయస్సు తదితర వివరాల్లో తప్పులు ఉన్నవారు వాటిని సరిచేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీపీ ఓ విష్ణుమూర్తి సూచించారు. 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు వివరాల సవరణకు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గతంలో సమర్పించిన ఎస్ఐఆర్ దరఖాస్తులతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి తప్పుల సవరణకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని, పొరపాట్లు ఉంటే వెంటనే సరిచేయించుకోవాలని సూచించారు. వివరాలు సరిచేయించుకోకపోతే భవిష్యత్తులో ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ మాట్లాడుతూ.. ఓటు హక్కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కు అని, ప్రతి ఒక్కరూ దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఓటు ఉన్న ప్రతి పౌరుడు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ ఎర్ర శ్రీకళ, పూజ, ఎస్ఐఆర్ సూపర్‌వైజర్ రాజు, దరఖాస్తుదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలన విజయోత్సవం




**మిర్యాలగూడ/ సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ వార్త):** మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన విజయోత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 1000 రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు మిర్యాలగూడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సాగుకు బయ్యారం పెద్ద చెరువు నీరు విడుదల చేయాలి.

### -మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్.



**బయ్యారం/సెప్టెంబర్ 1.(జర్నలిస్ట్ వార్త)**
మండలంలోని బయ్యారం పెద్ద చెరువు నీటిని రైతులు సాగుచేస్తున్న పంట పొలాలకు విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని తాహశీల్దార్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాతా గణేష్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హామీల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.బయ్యారం పెద్ద చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అనుసంధానం చేసి శాశ్వతంగా సాగునీటి కొరత తీర్చాలని డిమాండ్ చేశారు.బయ్యారం చెరువు నీటితో నిండి ఉన్నదని,మత్తడి పోసేందుకు సిద్ధంగా ఉన్నా రైతులు వేసిన పంట పొలాలకు నీరు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని,వెంటనే సాగు చేస్తున్న పంట పొలాలకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నీరు విడుదల చేయని యెడల బయ్యారాన్ని కరువు మండలంగా ప్రకటించి,సాగు చేసిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవిన్యూ అధికారులకు అందించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎనుగులు ఐలయ్య,సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు గంగుల సత్యనారాయన,బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముద్ర లోన్ పేరుతో రూ.6 లక్షల సైబర్ మోసం

**భీమదేవరపల్లి/సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):** ప్రధానమంత్రి ముద్ర యోజన పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని నమ్మించి సుమారు రూ.6 లక్షలు మోసం చేసిన ఘటన భీమదేవరపల్లి మండలంలో చోటుచేసుకుంది. ముల్కనూర్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన వడ్డేపల్లి జనార్దన్‌కు 2025 ఆగస్టు 15న ఉదయం 10 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాము ప్రధానమంత్రి ముద్ర యోజన నుంచి ఫోన్ చేస్తున్నామని, జనార్దన్‌కు లోన్ మంజూరు చేస్తామని నమ్మబలికాడు. లోన్ ప్రాసెసింగ్‌కు సర్వీస్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో అతడి మాటలను జనార్దన్ నమ్మాడు. దీంతో నిందితుడు సూచించిన ఫోన్ నంబర్లకు జనార్దన్ తన ఫోన్‌పే, గూగుల్‌పే ఖాతాల ద్వారా దఫదఫాలుగా సుమారు రూ.6 లక్షలు పంపించాడు. అయితే డబ్బులు పంపించినప్పటికీ ఎలాంటి లోన్ మంజూరు కాలేదు. అనంతరం నిందితుడు మళ్లీ ఫోన్ చేసి మరికొంత డబ్బు పంపిస్తే లోన్‌తో పాటు గతంలో పంపిన డబ్బులు కూడా తిరిగి వస్తాయని చెప్పాడు. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన జనార్దన్ ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ప్రజలు గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌ను నమ్మి లోన్లు, ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు పంపించవద్దని, ఎలాంటి ముందస్తు సర్వీస్ ఛార్జీలను చెల్లించవద్దని ఎస్ఐ సూచించారు.

## బయ్యారం మండలంలో ఎరువుల దుకాణాలు తనిఖీ.



**బయ్యారం/,సెప్టెంబర్ 1.(జర్నలిస్ట్ వార్త)** మహబూబాబాద్ ఏడిఏ శ్రీనివాసరావు బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజుతో కలిసి మంగళవారం రామచంద్రాపురం,కొత్తపేట,బయ్యారం ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల విక్రయదారులకు ఎరువుల విక్రయానికి సంబంధించిన ఫర్టిలైజర్ సేల్ యాప్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.రైతులకు ఎరువుల బుకింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,విక్రయ కేంద్రాల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.రైతులకు నూతన ఎరువుల బుకింగ్ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎరువుల బుకింగ్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తారన్నారు.రైతులు నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకుని, ఎరువుల బుకింగ్ ప్రక్రియలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు.

# రోడ్డు కోసం రోడ్డెక్కిన భీమదేవరపల్లి గ్రామస్తులు

## అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

## రోడ్డుపై నాట్లు వేసి నిరసన.. పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్



**భీమదేవరపల్లి/సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):** భూమిపూజ చేసి రెండేళ్లు గడుస్తున్నా భీమదేవరపల్లి గ్రామపంచాయతీ నుంచి వంగర రోడ్డు వరకు చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు రోడ్డుపై నాట్లు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రెండేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారని తెలిపారు. అయితే అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం శోచనీయమన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పలుమార్లు కలిసి విన్నవించామని, ప్రతిసారి మంత్రి స్వయంగా అధికారులకు, కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఈ రహదారి ఎంతో కీలకమైనదని, మండల అధికారులు, ప్రజలతో పాటు ఐదు మండలాలకు చెందిన ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ పనుల కోసం ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. నిత్యం ప్రజలు వినియోగించే ప్రధాన రహదారి దుస్థితిపై అధికారులు వెంటనే స్పందించి పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, వార్డు సభ్యులు పోలు సదానందం, పోలు అశోక్, బొల్లంపల్లి శ్యామ్, సాతురి విజయ, మార్పాటి లలిత, గ్రామ పెద్దలు గంగిరెడ్డి రాజమౌళి, శివసారపు రవీందర్, తాళ్లపల్లి సతీష్, మాచర్ల కర్ణాకర్, పోలు తిరుపతి, గాజుల కృష్ణ, మాచర్ల వెంకన్న, తాళ్లపల్లి సదానందం, కక్కర్ల వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, దాట్ల మధుకర్, గడల అజయ్, ఎర్ర రాజేష్, దాట్ల మొండయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



# ఊకె శిరీష హంతకులను కఠినంగా శిక్షించాలి.

## -భూక్యా రవి నాయక్.




**బయ్యారం/,సెప్టెంబర్ 1.(జర్నలిస్ట్ వార్త)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఉకే శిరీష హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో యువతీపై జరిగిన అత్యాచారం,హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్యా రవి నాయక్ తెలిపారు.ఈ ఘటనకు బాధ్యులైన నిందితుడు షాన్ ఉల్లా ఖాన్ ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సేవాలాల్ సేన పోరాటం ఆగదన్నారు.ఈ కార్యక్రమంలో అజ్మీర శ్రీకాంత్ నాయక్, జాటోత్ రవి నాయక్,అజ్మీర కళ్యాణ్ నాయక్,భూక్య మోహన్ నాయక్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 6న ముత్యాలమ్మ తల్లి జాతర.

## -ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ లు.



**బయ్యారం/సెప్టెంబర్ 1.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం,రంగాపురం, జగ్గుతండ గ్రామ ప్రజల ముఖ్య పండుగ అయిన ముత్యాలమ్మ తల్లి జాతర మండల కేంద్రంలో ఈ నెల 6న జరగనున్న నేపథ్యంలో బయ్యారం, జగ్గుతండ సర్పంచ్ లు గుగులోత్ శాంతి కిషన్ నాయక్, బొల్లి జయంతి వెంకటకృష్ణ మంగళవారం ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు.వేలాది మంది తరలివచ్చే భక్తులు కోసం ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా కావాల్సిన,కనీస అవసరాలు,గుడి వద్ద లైట్లు,పారిశుద్యం,త్రాగు నీరు,వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా,జగ్గుతండ ఉపసర్పంచ్ గుంజ వీరాస్వామి,బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,పాండవుల లింగయ్య,ఆకునూరి సూర్యనారాయణ,ఏనుగుల వంశీ,బీరెడ్డి శ్రీనివాస్,నర్సింహా రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ ఆఫీస్ శ్రీనగర్ కాలనీ వద్ద మంత్రి కోమటిరెడ్డి భారీ కటౌట్ బిజెపి నాయకులు తగల బెట్టారని ఆరోపణ



**నలగొండ. సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**

కేంద్రంలో రాజకీయ వాతాప రణశీ ఒక్కసారిగా వేడెక్కింది శ్రీనగర్ కాలనీలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి మంత్రి భారీ కటౌట్ ను బిజెపి నాయకులు తగలబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తు న్నాయి. ఈ ఘటన కాంగ్రెస్ బిజెపి వర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసేలా కనిపిస్తోంది. బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగంవర్షిత్ రెడ్డితో పాటు 25వ వార్డు కార్పొరేటర్ రాఖీ అనుచరులు ఒక మహిళతో కలిసి ఈ చర్యకు పాల్పడ్డారు. మంత్రి నివాసమే లక్ష్యంగా కోడిగుడ్లు. టమాటలు విసిరి దాడి చేనినట్లు తెలుస్తోంది ముశీదస్తు సమాచారం లేకుండా ఒక్కసారిగా క్యాంప్ ఆఫీస్ వద్దకు చేరుకున్న బిజెపి. శ్రే ణులు నిరసన తెలపడమే కాకుండా కటౌటికు నిప్పు పెట్టి యత్నశీ కలకలశీ రేపింది. ఘటన జరిగిన వెంటనే కాంగ్రెస్ శ్రేణులు అక్కడికి చేరుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రత ను భారీగా పెంచారు. దాడికి పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



# ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

## కొత్త నిబంధనలకు సడుగులు -అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..




**న్యూఢిల్లీ,సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):**
నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో కీలక మార్పులు రానున్నాయి. పథకాలను ఎలా వర్గీకరించాలి? వాటి వివరాలను ఎలా చూపించాలి? అన్నదానిపై పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మార్పులను ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడి ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 80-100 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ-ఏ'లో ఉంటాయి. వీటిని అత్యంత అధిక రిస్క్ ఉన్న 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60-80 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-బి'లో ఉంటాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35-60 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-సి'లో ఉంటాయి. ఇవి మధ్యస్థ రిస్క్ ఉన్న 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలు. 10-35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-డి'లో ఉంటాయి. వీటిని 'కన్జర్వేటివ్'గా పరిగణిస్తారు. 0-10 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-ఈ'లో ఉంటాయి. ఇవి రుణ ఆధారిత పథకాలుగా ఉంటాయి. ఒక పథకం ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదు. దీంతో పెట్టుబడిదారులు తమ రిస్క్ స్థాయికి తగ్గ పథకాన్ని సులభంగా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో చేరే వారికి మరో మార్పు కూడా ఉంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' (పీఓపీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే వారికి ఒక్కో పీఆర్ఏఎన్‌పై రూ.200 వన్‌టైమ్ ఛార్జీ వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ప్రతి త్రైమాసికానికి రూ.50 చొప్పున యూనిట్లను రద్దు చేసి వసూలు చేస్తారు. పథకాలను ఎంచుకునే ముందు పెట్టుబడిదారులకు మరింత సమాచారం అందేలా పీఎఫ్ఆర్‌డీఏ చర్యలు తీసుకుంది. పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలు ఒకే విధానంలో కనిపించనున్నాయి. అయితే ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు కొత్త వర్గీకరణ వర్తించదు.

# కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

## కెసిఆర్ అంటే అనుక్షణం భయంతో చస్తున్న రేవంత్ -ఆంధ్రాకు నీరు తరలిస్తున్నా అడ్డుకోసి అసమర్థ సిఎం

## మీడియా సమావేశంలో మండిపడ్డ జగదీశ్ రెడ్డి -మిర్యాలగూడ సభ నిర్వహించి తీరుతామని వెల్లడి



**సూర్యాపేట,సెప్టెంబర్1 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కళ్ల ముందే నీటి సమస్యలు కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్, నీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుందని జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ల్గ÷తాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభను నిర్వహించి తీరుతామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.